హైదరాబాద్
నమస్తే తెలంగాణ
శనివారం 8 జూన్ 2024
SATURDAY, JUNE 8, 2024

## చదువు EDUCATION

### రేపే గ్రూప్ -1 పరీక్ష.. ప్రత్యేక బస్సులు

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : టీజీపీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనున్నది. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు ప్రయాణ ఇబ్బందులు లేకుండా నగరంలోని పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెంటర్ల వద్ద బస్ స్టాపులు లేకున్నా బస్సులు ఆపుతామని చెప్పారు. సెంటర్ల వద్ద బస్సుల సమాచారం కోసం 9959226160, 9959226154 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

#### మేడ్చల్ జిల్లాలో 105 సెంటర్లు

గ్రూప్ 1 ప్రిలిమనరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్లు అభిషేక్ అగ్యస్త, విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో శుక్రవారం గ్రూప్ -1 పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో 105 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 69,727 మంది హాజరుకానున్నట్లు అదనపు కలెక్టర్ అభిషేక్ అగ్యస్త పేర్కొన్నారు.

#### 12 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 7 : ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ ఉదయం 6:30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9985856507, 9849752655 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

#### ఎంపీఈడీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 18వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

#### రివాల్యుయేషన్‌కు ..

ఓయూ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంబీఏ (నాన్ సీబీసీఎస్) ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్, ఎంబీఏ (సీబీసీఎస్) మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, ఈ నెల 15వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 15వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చాలెంజ్ ఎవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోదలిచిన వారు ఒక్కో పేపర్‌కు రూ.10000 చొప్పున చెల్లించి 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

#### ఎంఏ లాంగ్వేజెస్ ఫలితాలు

ఓయూ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కోర్సుల సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# పెచ్చులూడి.. తలలు పగిలి..!

## వామ్మో హోమియో దవాఖాన

- శిథిలావస్థలో రామంతాపూర్ హోమియో దవాఖాన
- పైకప్పు పెచ్చులూడి వైద్య సిబ్బందికి తృటిలో తప్పిన ప్రాణాపాయం
- వైద్య విద్యార్థిని, హెడ్ నర్సుకు తీవ్రగాయాలు
- చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రైవేటు దవాఖానకు తరలింపు
- వార్డులోని 12మంది రోగులను మరో వార్డుకు షిఫ్టు
- దవాఖాన, కళాశాల అధికారుల మధ్య ఆదిపత్య పోరు
- సందర్శనకు వచ్చిన రాష్ట్ర ఆయుష్ కమిషనర్ ముందే వాగ్వాదం

రామంతాపూర్, జూన్ 7 : రామంతాపూర్ హోమియోపతి ప్రభుత్వ దవాఖానలో కొందరు అధికారుల నిర్లక్ష్యం రోగులు, వైద్య సిబ్బంది పాలిట శాపంగా మారుతున్నది. శుక్రవారం దవాఖానలో భవనం పైకప్పు పెచ్చులూడి రోగులకు చికిత్స చేస్తున్న ఓ వైద్య విద్యార్థి, నర్సింగ్ సిబ్బందిపై పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి దవాఖాన ఆవరణలో ఉన్న ఇన్ పేషంట్ మేల్ వార్డులో స్లాబ్ పెచ్చులూడి అక్కడ రోగులకు చికిత్స అందిస్తున్న వైద్య విద్యార్థిని స్నేహిత, హెడ్ నర్సు సునీతపై పడ్డాయి. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. తృటిలో ప్రాణాపాయం తప్పిందని అక్కడి సిబ్బంది తెలిపారు. ఇన్‌పేషెంట్ వార్డు ఉన్న భవనం పురాతనమైనది కావడంతో పాటు దాని పర్యవేక్షణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు.



ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో ఇన్ పేషంట్ వార్డులో పెచ్చులూడిన సీలింగ్ స్లాబ్

#### ఆసుపత్రిని సందర్శించిన ఆయుష్ కమిషనర్.

విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆయుష్ కమిషనర్ ప్రశాంతి పెచ్చులూడిన భవనాన్ని సందర్శించారు. మరమ్మతుల కోసం ఇప్పటికే రూ.10 లక్షలు కేటాయించినప్పటికీ ఎందుకు మరమ్మతు చేయించలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరమ్మతుల కోసం మరిన్ని నిధులు ఇస్తామని వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఇదే సమయంలో, కమిషనర్ ముందే సూపరింటెండెంట్, ప్రిన్సిపల్ మధ్య గొడవ జరిగింది. దీంతో కమిషనర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో ఉన్న పేషంట్లను వెంటనే వేరే బ్లాక్‌లోకి షిఫ్టు చేయాలని ఆదేశించారు. గాయపడిన వైద్య విద్యార్థి స్నేహిత మంచి వైద్యం అందించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పలువురు ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



పెచ్చులూడిన భవనాన్ని సందర్శిస్తున్న ఆయుష్ కమిషనర్ ప్రశాంతి

#### ప్రశ్నార్థకంగా రోగుల ప్రాణాలు

చికిత్స కోసం రామంతాపూర్ హోమియో దవాఖానకు వస్తే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా శిథిలావస్థలో ఉన్న ఈ భవనంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోగులకు చికిత్స అందిస్తున్నామని జూనియర్ డాక్టర్లు వాపోతున్నారు. హోమియో దవాఖాన, కళాశాల అధికారుల మధ్య ఉన్న ఆదిపత్య పోరుతో దవాఖానకు సంబంధించిన సమస్యల పరిష్కారం, మౌలిక వసతులు ప్రశ్నార్థకంగా మారుతున్నట్లు వైద్య విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఆయుష్ అధికారులు స్పందించి నిత్యం వందల సంఖ్యలో వచ్చే రామంతాపూర్ హోమియో దవాఖాన సమస్యలపై దృష్టి పెట్టి, శిథిలావస్థలో ఉన్న ఇన్‌పేషెంట్ వార్డు ఉన్న భవనానికి మరమ్మతులు చేయించాలని వైద్య సిబ్బంది, రోగులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పెచ్చులూడిన ఘటనతో అక్కడ చికిత్స పొందుతున్న 12మంది రోగులను మరో వార్డుకు తరలించినట్లు దవాఖాన సూపరింటెండెంట్ డా.లక్ష్మీదేవి తెలిపారు.

## జలమండలిలో ఆత్మీయ సమావేశం



సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): జలమండలిలో పూర్వపు అధికారుల ఆత్మీయ సమావేశం జరిగింది. మారేడ్‌పల్లి డివిజన్‌లో పని చేసి రిటైర్డ్ అయిన అధికారులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించగా, గతంలో ఈ డివిజన్‌లో జీఎం, డీజీఎం, మేనేజర్లుగా పనిచేసి పదవీ విమరణ పొందిన అధికారులంతా హాజరయ్యారు. ఇందులో ఇటీవల ప్రాజెక్టు డైరెక్టర్‌గా రిటైర్డ్ అయిన శ్రీధర్ బాబు, వెంకటేశ్వర్లు, ఆనంద్ స్వరూప్, ప్రభాకర్ ఉన్నారు. వీరితో పాటు ప్రస్తుతం సీజీఎంగా కొనసాగుతున్న ప్రభు, డైరెక్టర్లు రవికుమార్, స్వామి తదితరులంతా పాల్గొన్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. సమావేశం అనంతరం పూర్వపు అధికారులతో పాటు వేసవిలో నీటి సరఫరా, ట్యాంకర్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులకు జ్ఞాపికలు అందించారు.

## ఆశావర్కర్లను తొలగిస్తే ఊరుకోం

కందుకూరు, జూన్ 7 : రాష్ట్ర ప్రభుత్వం కుంటి సాకులు చెప్పి కొంత మంది ఆశావర్కర్లను తొలగించాలని చూస్తుందని, ఆశా వర్కర్లను తొలగిస్తే ఊరుకునేది లేదని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్ అన్నారు. మండల పరిధిలోని ఆశావర్కర్లతో కలిసి శుక్రవారం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లను యథావిధిగా కొనసాగించాలని, ప్రభుత్వం నిర్వహించే పరీక్షలను రద్దుచేయాలని కోరారు. రూ.18వేల వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, రూ.5లక్షల ప్రమాద బీమా కల్పించాలన్నారు. ఆశావర్కర్లు జయసుధ, ముంతాజ్, ప్రేమలత, అనిత, సురేఖ, భాగ్య, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులకు వినతిపత్రం అందజేస్తున్న బాలరాజ్, ఆశావర్కర్లు

## ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డేగల సతీష్‌బాబు



సతీష్‌బాబుకు నియామకపత్రం అందజేస్తున్న అంబటి కృష్ణమూర్తి

రవీంద్రభారతి, జూన్ 7 : ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డేగల సతీష్‌బాబు నియమితులయ్యారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డా.అంబటి కృష్ణమూర్తి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.నాగరాజు, గుంజ శ్రీనివాస్, ఐలయ్యగౌడ్, జేమ్స్, గురుప్రసాద్‌రావు, క్రిష్ణారెడ్డి, వికాస్‌సింగ్, అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ మంత్లీ బస్‌పాస్ పోస్టర్ ఆవిష్కరణ



సిటీబ్యూరో, జూన్ 7 ( నమస్తే తెలంగాణ ) : బస్‌పాస్‌ల కోరకు దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్ టీజీఎస్‌ఆర్టీసీపాస్.కామ్ గా మార్చినట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. దీంతో పాటు విద్యా సంస్థల యాజమాన్యం అడ్మినిస్ట్రేషన్ చార్జీలు పేమెంట్ కొరకు టీజీఎస్‌ఆర్టీసీపాస్.కామ్ సంప్రదించాలన్నారు. అనంతరం గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ మంత్లీ బస్ పాస్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు తోట శ్రీనివాస రావు, ఏటీఎం చలపతి, బి.మహేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఇక నుంచి బల్దియాలో డిజిటల్ పేమెంట్లు

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీకి సంబంధించి పేమెంట్లు ఇక నుంచి డిజిటల్ రూపంలోనే ఉంటాయని కమిషనర్ రొనాల్డ్ రాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహించే క్రమంలో భాగంగా పౌరులకు పారదర్శకంగా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్ పేమెంట్లు మాత్రమే వినియోగంలో ఉంటాయని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ సంబంధించి బిల్ కలెక్టర్లంతా ఆస్తి పన్ను చెల్లింపులు పీవో మిషిన్ ద్వారానే తీసుకుంటారన్నారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## 10న వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవ సభ

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 7 : ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్‌యూ) ఆరవ స్నాతకోత్సవం ఈ నెల 10న రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరుగనున్నదని వ్యవసాయ శాఖ కార్యదర్శి ఏపీసీ, పీజేటీఎస్‌యూ ఇన్‌చార్జి ఉపకులపతి ఎం.రఘునందన్ రావు తెలిపారు. తెలంగాణ గవర్నర్ గవర్నర్ డా.సీపీ రాధాకృష్ణన్ అధ్యక్షతన జరుగనున్న ఈ కార్యక్రమానికి భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా శ్రీనివాస్ శెట్టి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 587మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను, 165మంది విద్యార్థులకు పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందజేయనున్నట్లు తెలిపారు. 11మంది పీజీ, 8 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు బంగారు పథకాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## 11న తుక్కుగూడలో జాబ్ మేళా

సిటీబ్యూరో, జూన్ 7 ( నమస్తే తెలంగాణ ) : శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని తుక్కుగూడలో హార్డ్‌వేర్ పార్క్–జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీలో ఈ నెల 11న మెగా వాక్ ఇన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నీషియన్స్, క్వాలిటీ ఇన్‌స్పెక్టర్స్, ప్రొడక్షన్ ఇంజినీర్స్, క్వాలిటీ ఇంజినీర్స్ తదితర సంబంధిత ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీటెక్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ పూర్తయిన వారు అర్హులని తెలిపారు. ttps://forms.gle/Hr5Xieav dXPbqbhk6 లింకులో రిజిస్టర్ కావాలని చెప్పారు.

## మాతృభాష, మాతృభూమి ఎంతో గొప్పది

### జర్నలిస్టు కేవీ రమణారావు



సీనియర్ జర్నలిస్టు కేవీ రమణారావుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరిస్తున్న మేయర్ సురేంద్ర శ్రేష్ఠ

రవీంద్రభారతి, జూన్ 7 : నేపాల్‌లోని ఖాట్మండు, జ్వాలాఖల్ లలి తూర్పర్ ప్రాంతంలో సార్క్ జర్నలిజం ఫోరం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరిగిన మాతృభాషలో జర్నలిజం శతాబ్ది వేడుకలకు వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేపాల్ మాజీ అధ్యక్షురాలు బిద్యాదేవి భండారి, ఉప ప్రధాని నారాయణ్ కాజి, తిమి మేయర్ సురేంద్ర శ్రేష్ఠ , సార్క్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు రాజు ఆమా, అబ్బుల్ రెహమాన్, అనిరుధ్ సుధాన్షు, క్లీన్లీ , తెలంగాణ రాష్ట్రం నుంచి సీనియర్ జర్నలిస్టు కేవీ.రమణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. మాతృభాషను, మాతృభూమిని, అమ్మను ఎప్పటికీ మరిచిపోరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతదేశం, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ , మాల్దీవ్స్, పాకిస్తాన్, తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హైకోర్టులో అడిషనల్ ఏజీ పోస్టును మాదిగలకు కేటాయించాలి

రవీంద్రభారతి, జూన్ 7 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా హైకోర్టులోని అడిషనల్ అడ్వకేట్ జనరల్ పోస్టును మాదిగలకు కేటాయించాలని కోరుతూ మాదిగ రాజ్యాంధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజ్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా నవీన్‌రాజ్ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మాదిగలకు ఉన్నత పదవులు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. బి.ఉపేందర్, జయరామరాజు, తేజ, రంజిత్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు రావడంలో అక్కినేని కీలకపాత్ర



వరుణ్ సందేశ్‌కు అక్కినేని యువ ఎక్సలెన్సీ అవార్డును అందజేస్తున్న మురళీమోహన్ తదితరులు

బంజారాహిల్స్, జూన్ 7 : తెలుగు సినీ పరిశ్రమను మద్రాస్ నుంచి హైదరాబాద్ తీసుకురావడంలో మహానటుడు అక్కినేని నాగేశ్వర్‌రావు కీలకపాత్ర పోషించారని ప్రముఖ సినీనటుడు మురళీమోహన్ అన్నారు. ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఫిలించాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అక్కినేని హీరోగా వచ్చి 80ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని 'అక్కృతి యువ ఎక్సలెన్సీ అవార్డు'ను యువ హీరో వరుణ్ సందేశ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, ఆకృతి సుధాకర్, కేవీ.కృష్ణకుమారి, కొత్త వెంకటేశ్వరరావు, ఉప్పల శ్రీనివాస గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## భారత్ కళా మేళా జాతీయ స్థాయి ఎగ్జిబిషన్ ప్రారంభం




కార్యక్రమంలో మాట్లాడుతున్న నర్సింగ రావు

మలక్‌పేట, జూన్ 7 : గ్రామీణ ప్రాంతాల్లోని దివ్యాంగులు తయారు చేసిన వస్తువులను విక్రయించేందుకు జాతీయస్థాయి ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తూ ఆర్థిక స్వావలంబన చేకూర్చే దిశగా వరల్డ్ పద్మశాలి ఫౌండేషన్ కృషి చేస్తున్నదని ఫౌండేషన్ చైర్మన్ గజం నర్సింగరావు తెలిపారు. శుక్రవారం నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల జాతీయ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన భారత్ కళా మేళా జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌ను దివ్యాంగులతో కలిసి ప్రారంభించారు. ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసేబుల్డ్(ఫెడ్), వరల్డ్ పద్మశాలి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడ్ చైర్మన్ మద్దెల గంగారాం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ నారా నాగేశ్వర్ రావు, దక్కి కార్యదర్శి శ్రీనివాస్, వ్యాపారులు ఆలపాటి రమేశ్, గోపీ, వసంత, విద్యావతి, దివ్యాంగ గాయకుడు ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంప్‌లో హైదరాబాద్ విజయం

హైదరాబాద్ ఆట ప్రతినిధి, జూన్ 7 (నమస్తే తెలంగాణ) :నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ఫిజియోస్ మిషన్ వాక్ హాస్పిటల్స్ జట్టు ఘన విజయం సాధించింది. శుక్రవారం రాజేందర్‌నగర్‌లోని విజయ్ ఆనంద్ క్రికెట్ మైదానంలో మైటి స్పోర్ట్స్ డైరెక్టర్ నంద పాండే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో హైదరాబాద్ ఫిజియోస్ మిషన్ వాక్ హాస్పిటల్స్ జట్టు పది వికెట్ల తేడాతో తుంగా హాస్పిటల్స్ మహారాష్ట్ర జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 126 పరుగులు చేసింది. డాక్టర్ సతీష్ శెట్టి 61 పరుగులు చేశారు. మహారాష్ట్ర జట్టు 89 పరుగులు చేయగా హైదరాబాద్ బౌలర్ రజనీ 39 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈ నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంపియన్ షిప్‌ను ఫారెస్ట్ నేషన్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శరత్ నలమోతు, మైటి స్పోర్ట్స్ డైరెక్టర్ నంద పాండే ప్రారంభించారు. కో డైరెక్టర్ నిఖిల్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## రోగి మెదడులో కణితి.. తొలగించిన నిమ్స్ వైద్యులు



రోగి నరహరితో నిమ్స్ వైద్య బృందం

ఖైరతాబాద్, జూన్ 7 : అరుదైన, క్లిష్టమైన సర్జరీలను విజయవంతంగా నిర్వహించడంలో నిమ్స్ దవాఖాన అనేక మైలు రాయిలను అదిగమించింది. ఇటీవల ఓ గొత్తికోయ యువకుడికి గుండె, ఊపిరితిత్తులను అనుకొని ఉన్న బాణాన్ని తొలగించి ప్రాణం పోసిన నిమ్స్ వైద్యులు అనేక అతిక్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ కార్పొరేట్‌కు ధీటుగా నిలుస్తున్నారు. తీవ్ర తలనొప్పి, వాంతులతో బాధపడుతున్న సంగారెడ్డికి చెందిన నరహరి (35) నిమ్స్ న్యూరో సర్జరీ విభాగం వైద్యులను సంప్రదించాడు. న్యూరో సర్జన్ డాక్టర్ వై.తిరుమల్ బృందం వివిధ పరీక్షలు నిర్వహించగా, అతి సంక్లిష్ట ప్రాంతమైన మెదడు మధ్యభాగంలోని నరాల్లో కణితిని గుర్తించారు. అత్యాధునిక వెనోగ్రామ్ పరీక్ష ద్వారా శస్త్రచికిత్స చేయాల్సిన చోటును గుర్తించారు. క్రానియోటమి, ఆసిపిటల్ ట్రాన్స్ టెనోరియల్ పద్ధతిలో శస్త్రచికిత్సను నిర్వహించి విజయవంతంగా నరాల్లో ఉన్న కణితిని తొలగించారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకున్నాడు. విజయవంతంగా క్లిష్టమైన శస్త్ర చికిత్స నిర్వహించిన న్యూరో వైద్యులు డాక్టర్ తిరుమల్, డాక్టర్ నితిన్, డాక్టర్ విశాల్, డాక్టర్ దీపక్ బృందాన్ని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుచంద, డాక్టర్ వంశీకృష్ణలు అభినందించారు.

## కళలు, కళాకారులకు ప్రోత్సాహం

### ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంతో మంత్రి జూపల్లి క్రిష్ణా రావు



ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కార్వాన్, జూన్ 7 : ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ కళ అందరికీ అందుబాటులో ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఢిల్లీలో 20 ఎడిషన్ల అనంతరం మొదటిసారిగా హైదరాబాద్‌లో ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌ను మూడు రోజుల పాటు గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేశారు. శుక్రవారం మొదటి రోజు కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు, కళాకారులకు ప్రోత్సాహం అవసరమని, రాష్ట్ర ప్రభుత్వం వారి అభివృద్ధికి కట్టుబడి ఉందని చెప్పారు. గౌరవ అతిథిగా పాల్గొన్న పార్వతీ రెడ్డి మాట్లాడుతూ ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాల వల్ల యువ కళాకారులు ప్రజలకు చేరువ కావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ఫెస్టివల్‌లో మొత్తం 30 గ్యాలరీలు, 250 మంది కళాకారులు తమతమ 3500 కళాఖండాలను 100 స్టాల్స్‌లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫ్యూజన్ షో మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఎన్ఏఆర్ ఇన్‌ఫ్రా డైరెక్టర్ కె.లక్ష్మా గౌడ్, ప్రముఖ కళాకారుడు అంజు పొద్దార్, రచయిత రాజేంద్ర, ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ నిర్వాహకులు గణేశ్ కుమార్, మల్హుర్కర్, సమకాంతా రెడ్డి, ఓం తాడ్కార్, పాల్గొన్నారు.